జిల్లా అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి కలిసి పనిచేద్దాం

● అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారి



ఆసిఫాబాద్ : జిల్లాలో కొనసాగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజల సంక్షేమానికి కలిసి పని చేద్దామని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్‌గా పనిచేసి జిల్లాకు బదిలీపై వచ్చిన ఆయనను జిల్లా అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి సమిష్టిగా కృషి చేద్దామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల

కుమురం భీం-ఆసిఫాబాద్

బుధవారం 02 ఆగస్టు 2023

1

పంచాయతీ కార్మికులకు అంగన్‌వాడీల మద్దతు

నవతెలంగాణ - దహెగాం



పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ మద్దతు పలికింది. 27వ రోజు మంగళవారం అంగన్‌వాడీలు కార్మికులకు మద్దతుగా ధర్నాలో కూర్చున్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు వజ్రమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ నాయకురాలు శోభ, మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

7న బీసీ జాతీయ మహాసభను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీసీల గొంతుక వినిపించేలా ఈ నెల 7న తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ స్టేడియంలో నిర్వహించే అఖిల భారత జాతీయ ఓబీసీ 8వ మహాసభను విజయవంతం చేయాలని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్ కోరారు. జిల్లా కార్యాలయంలో జాతీయ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల గొంతుక ప్రతి ఒక్కరికి వినబడేలా మహాసభ నిర్వహించడం జరుగుతుందన్నారు. హక్కుల కోసం పోరాటం చేసినప్పుడే విజయం సాధ్యమవుతుందన్నారు. దీనికోసం బీసీలంతా ఐక్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మహాసభను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సభకి పెద్ద ఎత్తున బీసీ సంక్షేమ సంఘం కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు గాజుల జక్కయ్య, వైరాగడి మారుతి పటేల్, గడ్డల శంకర్, అనుముల శంకర్, సిరికొండ సాయికృష్ణ, ఆవిడపు ప్రణయ్, బొట్టుపల్లి ప్రశాంత్, సైదం నాగరాజు, ముజ్జు పాల్గొన్నారు.

పురుగులమందు తాగి మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ - బెజ్జూర్



పురుగులమందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో జరిగింది. ఎస్ఐ విక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన బురుస బాయక్క(57) కుటుంబ సమస్యల కారణంగా సోమవారం సాయంత్రం పురుగులమందు తాగింది. మృతురాలి భర్త ఎర్రయ్య తరుచూ మద్యం తాగుతూ కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి భర్త, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు.

బాదంపల్లిలో మొసలి



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని బాదంపల్లిలో మంగళవారం పాడుబడిన ఇంట్లో మొసలి కన్పించడంతో గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయ సమీపంలో ఉన్న పాడుబడిన ఇంట్లో మొసలిని చూసి స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఎఫ్‌బీఓ సతీష్ సంఘటన స్థలానికి చేరుకొని మొసలిని పట్టుకొని సమీప గోదావరి నదిలో వదిలిపెట్టారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం : జెడ్పీటీసీ పుష్పలత



నవతెలంగాణ - బెజ్జూర్

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని జెడ్పీటీసీ పుష్పలత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన శిశువుకు ఆరు నెలల పాటు తల్లిపాలు తాగించడం వల్ల తల్లీబిడ్డ ఇద్దరికీ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. తల్లిపాలు తాగించడం వల్ల పోషకాహార లోపం, అధిక బరువు వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటాయన్నారు. ఆరు నెలల అనంతరం శిశువుకు సమతుల్య ఆహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కరుణ, ఐకేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలోనే డెలివరీ చేసుకోవాలి



నవతెలంగాణ-దస్తురాబాద్

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం 35 మంది గర్భిణులకు రక్త, ఆరోగ్య పరీక్షలు నిర్వహించామని డాక్టర్ కామేశ్వర్ తెలిపారు. నార్మల్ డెలివరీ ప్రభుత్వ ఆసుపత్రిలోనే చేయించుకోవాలని ప్రోత్సహించారు. గతంలో పెద్ద ఆపరేషన్ అయిన వారికి కూడా ప్రభుత్వ ఆసుపత్రిలోనే పెద్ద ఆపరేషన్ ద్వారా శస్త్ర చికిత్స చేసి డెలివరీ ఉచితంగా చేస్తామని తెలిపారు. ఇందులో ఆరోగ్య విస్తరణ అధికారి టి.వేణుగోపాల్, ల్యాబ్‌టెక్నీషియన్ రాజేందర్, సూపర్వైజర్ లలిత, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సంబరాలు

● కేసీఆర్‌కు పాలాభిషేకం, టపాసులు కాలుస్తూ సంబరాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ ఉద్యమ సమయంలో నిర్వహించిన సకల జనుల సమ్మెలో ఆర్టీసీ ఉద్యోగులు క్రియాశీలక పాత్ర పోషించారని, వారి ఆకాంక్షలకు తగ్గట్టుగానే ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం హర్షణీయమని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఉద్యోగులు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ముఖ్యమంత్రి కెసిఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపారు. పెద్ద ఎత్తున టపాసులు పేలుస్తూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల చిరకాల స్వప్నాన్ని ముఖ్యమంత్రి కెసిఆర్ సాకారం చేశారన్నారు. సకల జనుల సమ్మెలో కీలకంగా వ్యవహరించిన ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం అండగా నిలిచిందని పేర్కొన్నారు. ఉద్యోగుల ఆకాంక్షలను నెరవేర్చిన ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం సోలోమాన్, డిఎం కల్పన, నాయకులు సాజిదోద్దీన్, గంగారెడ్డి, పండ్ల శ్రీను, రాంకుమార్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : తెలంగాణ మంత్రి వర్గం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు సోమవారం ప్రభుత్వం చేసిన ప్రకటనకు జిల్లా కేంద్రంలోని డిపోలో ఏఐటియుసి ఆధ్వర్యంలో కార్మికులు సంబరాలు నిర్వహించుకున్నారు. ఒకరికొకరు స్వీట్స్ తినిపించుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ పోరాట ఫలితంగానే ఆర్టీసీ విలీనం నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుందన్నారు. ఇది ఆర్టీసీ కార్మికుల విజయమని తెలిపారు. ఆర్టీసీ అమరవీరులకు ఈ విజయం అంకితమన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ ఆర్టీసీలో ఉన్నప్పుడే రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణతో కమిటీ వేయించామని గుర్తు చేశారు. 2019లో విలీనం కోసం సమ్మె చేసినప్పుడు ముఖ్యమంత్రి వ్యతిరేకించారన్నారు. అయినప్పటికీ మొక్కవోని ఆత్మవిశ్వాసంతో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి చివరికి విజయం సాధించామన్నారు. సేవ్ ఆర్టిసి పేరుతో అన్ని సంఘాలను కలుపుకొని చేస్తున్న నిరసన కార్యక్రమాలు ఫలించాయన్నారు. ముఖ్యమంత్రికి, ఇతర మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు అశోక్, డిపో ప్రధాన కార్యదర్శి దివాకర్, నాయకులు సుధాకర్ పాల్గొన్నారు.



రైతులు సంఘటితమైతే అద్భుతాలే..

● కలెక్టర్ వరుణ్‌రెడ్డి ● గిరిజన రైతు ఉత్పత్తిదారుల సంస్థ ప్రారంభం



నవతెలంగాణ-పెంబి

రైతులు సంఘటితమై శక్తిగా మారితే ఎన్నో అద్భుతాలు సృష్టించగల్గుతారని కలెక్టర్ వరుణ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలో గిరిజన రైతు ఉత్పత్తిదారుల సంస్థను ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుమూల మండలంలో 320 మంది గిరిజన రైతులు ఒక తాటి పైకి వచ్చి రూ.32లక్షల మూల ధనంతో మండల స్థాయిలో సంస్థగా ఏర్పడటం చాలా గొప్ప విషయమన్నారు. సంస్థను సరైన మార్గంలో నడిపి గిరిజన ప్రజలకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులతో పాటు అధిక దిగుబడి అందించగల నాణ్యమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ రైతుల డిమాండ్ మేరకు నాబార్డు, ఐటీడీఏ సంయుక్త సహకారంతో గిరిజన రైతు ఉత్పత్తిదారుల సంస్థకు అవసరమైన గోదాములను రాయితీపై నిర్మించి ఇచ్చేలా సహకారం అందిస్తామని తెలిపారు. ప్రస్తుతం ఐటీడీఏ తరపున గిరిజనులకు రాయితీపై మామిడి, జామ, కొబ్బరి, మునగ మొదలగు పండ్ల తోటలకు నాణ్యమైన మొక్కలను అతి తక్కువ ధరలకే అందిస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం సంస్థ అధ్యక్షుడు బుక్యా టికాజి సంస్థ భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను అధికారులు, ప్రజలకు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్యామ్‌నాయక్, జెడ్పీటీసీ జానుబాయి, ఎంపీపీ కవిత, సర్పంచ్ పూర్ణచందర్‌గౌడ్, మ్యాక్స్ చైర్మెన్ రామేశ్వర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, నాబార్డ్ డిడియం వీరభద్రమ్, ఏడీఏ సుజాత, స్పైయిస్ బోర్డు డీడీ సుందరేషన్, తహశీల్దార్ శ్రీధర్, యంపిడిఓ సుధాకర్, రిలయన్స్, సిఆర్డి ఫౌండేషన్, డ్రీమ్ ఫౌండేషన్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వానికి ఓట్లు అడిగే నైతిక హక్కు లేదు

● ఎమ్మెల్యే జోగు రామన్న ● 196 మంది లబ్దిదారులకు చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశ ప్రజానీకాన్ని ముప్పుతిప్పలు పెడుతూ, నిత్యావసర సరకుల ధరలను భారీగా పెంచుతున్న బీజేపీ ప్రభుత్వానికి ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 196 మందికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లల తల్లిదండ్రులు పెండ్లి సమయంలో ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి కెసిఆర్ కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి బృహత్ పథకాలను అమలు చేసి పేద కుటుంబాలకు అండగా నిలబడుతున్నారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక బూటకపు హామీలు ఇచ్చి ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని మండిపడ్డారు. ఉజ్వల పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పిన ప్రధాని మోడీ ప్రస్తుతం సిలిండర్ ధరను రూ.1250కి పెంచిందని ఆక్షేపించారు. నల్ల ధనాన్ని వెనక్కి తెచ్చి జన్ ధన్ ఖాతాల్లో వేస్తామని ఇచ్చిన హామీ సంగతేంటని ప్రశ్నించారు. ఈ విషయాలపై ప్రజలు బీజేపీ నాయకులను నిలదీయాల్సిన అవసరముందన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన ఐటీడీఏ చైర్మన్ లక్కేరావుకు సంతాపం వ్యక్తం చేస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పూర్తయిన సందర్భంగా అడహక్ కమిటీ గౌరవ అధ్యక్షుడు దుర్గం శేఖర్‌ను, సభ్యులను ఎమ్మెల్యే జోగు రామన్న శాలువా, పుష్పగుచ్చాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎంపిపి గంద్రత్ రమేష్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అలాల్ అజయ్, అధికార ప్రతినిధి గంగారెడ్డి, సలీం, సాజిదోద్దీన్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

నవతెలంగాణ - దహెగాం

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు సంతోష్‌గౌడ్, సర్పంచ్ బండ కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం మండలంలోని బీబ్రా గ్రామ పంచాయతీ పరిధిలో గల దేవాజీగూడ గ్రామంలో మండల ప్రజా పరిషత్ నిధులు రూ.5లక్షలతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంటును రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో తాగునీరులో సుద్ద వచ్చి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నందున ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదేశానుసారం ప్లాంటును ఏర్పాటు చేశామన్నారు. ప్రజలందరికి మౌళిక వసతులు కల్పించి ఆరోగ్యాలను కాపాడడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామస్తులందరు మినరల్ వాటర్‌ను వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు నాయికిని లక్ష్మణ్, విఘ్నేష్, నాగేష్, రమేష్ పాల్గొన్నారు.



గుండెపోటుతో ఏటీడబ్ల్యూఏసీ చైర్మెన్ లక్కేరావు మృతి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఆదివాసీ ముద్దు బిడ్డ, ఏటీడబ్ల్యూఏసీ చైర్మన్ కనక లక్కేరావ్ గుండెపోటుతో మంగళవారం మృతి చెందాడు. మార్చి నెలలో ఆయనకు తొలిసారి గుండెపోటు రాగా హైదరాబాద్‌కు వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. అప్పటి నుంచి ఆయన ఆరోగ్యం క్షీణించింది. తిరిగి రెండవ దఫా గుండెపోటు రావడంతో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు. ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ ఆ ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆదివాసుల రాయిసెంటర్‌లో సలహాదారుడిగా సేవలందించాడు. రాజకీయాల్లో ప్రముఖ పాత్ర పోషించాడు. 2015-16 నుంచి ఏటీడబ్ల్యూఏసీ చైర్మన్‌గా పనిచేస్తున్నాడు. అతని మృతితో మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అంత్యక్రియలు మంగళవారం సాయంత్రం స్వగ్రామం తుమ్మగూలో జరిగాయి. అంత్యక్రియలకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యేలు జోగు రామన్న, ఆత్రం సక్కు, నిర్మల్ జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఐటీడీఏ పివో చాహత్ బాజ్‌పాయ్, జిల్లా కలెక్టర్ రాహూల్ రాజ్, మాజీ ఎంపీ గొడెం నగేష్, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ హాజరయ్యారు.

ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఐటీడీఏ పీఓ



నవతెలంగాణ-దస్తురాబాద్

మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను మంగళవారం ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట వంటగదిని పరిశీలించి, వండిన వంటలను పరిశీలించారు. పిల్లల ఆహారం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తెలిపారు. ఉపాధ్యాయులను నీటి వసతి గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వర్షాకాలం సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం తరగతి గదులలోకి వెళ్లి విద్యార్థులను పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల పఠనా శక్తిని పరిశీలించారు. విద్యార్థుల చదువు పట్ల నిర్లక్ష్యం వహించవద్దని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో ఏమైన సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఆమె వెంట ఉపాధ్యాయులు చందునాయక్, ముత్యం, స్వర్ణలత ఉన్నారు.

డీఎంఈ సర్క్యులర్ ప్రకారం వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు డిఎంఈ సర్క్యులర్ ప్రకారం వేతనాలు చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం రిమ్స్‌లోని ఎమర్జెన్సీ బ్లాక్ ఎదుట కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. క్రిష్ణ కన్‌స్ట్రక్షన్ ఏజెన్సీ తీసుకున్న అగ్రిమెంట్ ప్రకారం కార్మికులకు కాంట్రాక్టర్ వేతనాలు ఇవ్వకపోతే అర్థం ఏంటని ప్రశ్నించారు. ఇది ఎంత వరకు సమంజసమని రిమ్స్ డైరెక్టర్‌ను, జిల్లా అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికైనా రిమ్స్ డైరెక్టర్ జిల్లా అధికారులు వెంటనే స్పందించి క్రిష్ణ కన్‌స్ట్రక్షన్ ఏజెన్సీని తొలగించి సర్క్యులర్ ప్రకారం వేతనాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. సమస్యలు పరిష్కారం కాకపోతే అవసరమైతే సమ్మెకు పోవడానికి కూడా వెనకాడమని అధికారులకు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు కన్నల లక్ష్మీ, ఎస్కె ఇక్బాల్, రాజేందర్ సింగ్, డేవిడ్, శంకర్, అరిఫ్, రుక్మిణి, రవి, శ్రీకాంత్, సైఫ్, పద్మ, రవీందర్ రాథోడ్, మంగమ్మ పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు ప్రథమ చికిత్సపై శిక్షణ



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు ప్రథమ చికిత్సపై శిక్షణ తరగతులను ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి మంగళవారం శ్రీరాంపూర్ ఏరియా వృత్తి శిక్షణ కేంద్రంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థలో మహిళా ఉద్యోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటంతో వారికి కూడా ప్రథమ చికిత్స మీద అవగాహన పెంపొందించడానికి ఈ శిక్షణ తరగతులు ప్రారంభించామన్నారు. 10 రోజుల శిక్షణ తరగతులను ప్రతి ఒక్క మహిళా ఉద్యోగి సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అలాగే శిక్షణ తరగతులు పూర్తి అయిన తర్వాత నిర్వహించే ప్రాక్టికల్, మౌఖిక పరీక్షలలో ఉత్తీర్ణులైన మహిళా ఉద్యోగులకు ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్ ఇస్తామన్నారు. సంస్థ ఉద్యోగులకు ఉచితంగా ప్రథమ చికిత్స సంబంధిత పుస్తకం అందజేయడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీవైసీఎంఓ డాక్టర్ పి రమేష్ బాబు, వృత్తి శిక్షణ కేంద్రం ఎస్ఓఎం కల్లూరి వెంకట రామారావు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన హ్యూమన్ రైట్స్ సభ్యులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆదిలాబాద్ అదనపు కలెక్టర్ కె.శ్యామలా దేవిని ఆమె కార్యాలయంలో సార్క్ నేషన్స్ ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఆమెను శాలువాతో సత్కరించి, పూల మొక్కను అందజేశారు. సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను ఆమెకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పున్నం రావు, ప్రధాన కార్యదర్శి ఉదయ్ కిరణ్, జిల్లా చైర్మెన్ వెంకటపతి, సోషల్ మీడియా ఇన్‌చార్జి లక్ష్మణ్, సన్నీ ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రతి ఒక్కరూ విధిగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా అధికారి శ్రీధర్ అన్నారు. మంగళవారం డ్రైడేలో భాగంగా పట్టణంలోని కోలీపూర కాలనీలో పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ నిల్వ ఉన్న నీటిని పారేయాలని సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువ శాతం కీటక జనితంగానే వస్తాయని డీఎంఓ డాక్టర్ శ్రీధర్ తెలిపారు. వారంలో రెండు సార్లు డ్రైడేను పాటించాలని అన్నారు.

అన్నాభావు సాఠే అడుగుజాడల్లో నడవాలి



నవతెలంగాణ-నార్నూర్

లోక్ సాహిత్య సామ్రాట్ అన్నాభావు సాఠే అడుగుజాడల్లో నడిచి ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ జాదవ్ స్థానిక సర్పంచ్ మధుకర్ రాథోడ్ అన్నారు. మంగళవారం తాడిహత్నూర్ గ్రామంలో అన్నాభావు సాఠే 103వ జయంతిని పురస్కరించుకొని దళిత నాయకులతో కలిసి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నాభావు సాఠే బడుగు బలహీన వర్గాల కోసం సమాజం కోసం ఎనలేని కృషి చేశారని, నేటి యువత చెడు వ్యసనాలకు దూరం ఉండి వారి ఆశయ సాధనకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ విష్ణు ఫడ్, కమిటీ సభ్యుడు లక్ష్మణ్, నాయకులు పండరి సూర్యవంశీ, జాదవ్ భానుదాస్, జాదవ్ లాలూ, బాబు, వాగ్మారే వామన్, భావ్‌రావ్, భోస్లే పరమేశ్వర్, మహాదవ్, జాదవ్ రమేష్, బాబు, సూర్యవంశీ తానాజీ, రాజు, రాజ్ పంగే బాలాజీ, దిగాంబర్ పాల్గొన్నారు.

వరదతో దెబ్బతిన్న పంటల పరిశీలన



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని కుమారి పరిసర ప్రాంతాల్లో అతిభారీ వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన పంటలు, కోతకు గురైన భూములను మంగళవారం ఏఐసీసీ సభ్యులు డాక్టర్ నరేష్ జాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను ఈ బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోక పోవడం శోచనీయమని అన్నారు. కనీసం నష్టం వాటిల్లిన ప్రాంతాలలో పర్యటించకపోవడం బాధ్యతా రహిత్యమన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వారితో పాటు టీపీసీసీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమ్రం కోటేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ నాగనాథ్ అప్ప, ఇచ్చోడ మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆసిఫ్ ఖాన్, బోథ్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు గంగారాం, మండల కాంగ్రెస్ నాయకులు రాజుగౌడ్, నరేష్‌రెడ్డి, చంద్రశేఖర్, భూమయ్య, అరిఫ్ ఖాన్, రైతులు, గ్రామ ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యా, భోజనం అందించాలి

- ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్



నవతెలంగాణ-కడెం

విద్యార్థులకు నాణ్యమైన విద్యా, భోజనం అందించాలని ఉట్నూర్ ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్ సూచించారు. మంగళవారం నిర్మల్ జిల్లా కడెం మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి వంటగదిని, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారు అభ్యసించిన సబ్జెక్టుల పట్ల పుస్తకాల్లో చూసి విద్యార్థులతో చదివించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆశ్రమ పాఠశాల వార్డెన్ రాంజీ, ప్రధానోపాధ్యాయులు బలరాం నాయక్‌కు సూచించారు. అలాగే విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని అన్నారు. అనంతరం ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు బోధన పట్ల పాఠశాల ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఏఐసీసీ సభ్యురాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్



ఆదిలాబాద్ మండలంలో భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటలను మంగళవారం ఏఐసీసీ సభ్యురాలు గంద్రత్ సుజాత పరిశీలించారు. మండలంలోని బూర్నూర్ గ్రామంలో పూర్తిగా దెబ్బతిన్న ఇండ్లను, పంటపొలాలను, యాపల్‌గూడ, అంకొలి గ్రామల్లోని పంటలను సందర్శించారు. వర్షంతో పంటలు సర్వం కోల్పోయిన రైతు తన పంటను చుపిస్తూ, ఎడుస్తూ తమ భాదను వ్యక్తం చేశారు. ఆమెతో పాటు నాయకులు అరిగేలా కిష్టయ్య, అరె పోచ్చన్న, ఆనంద్, నర్సింగ్, సురేష్, కన్య ప్రభాకర్‌రెడ్డి, గంగయ్య విఠల్, కిష్టు గంగారెడ్డి పాల్గొన్నారు.

బీడీ టేకేదార్లకు జీవనభృతి కల్పించడం పట్ల హర్షం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీడీ టేకేదార్లకు రూ.2016 జీవన భృతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల మంగళవారం ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి జగన్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న బీడీ కార్మికులు, టేకేదారులు, ప్యాకర్లు, బట్టీవాలా ఇతర కార్మికులందరికీ జీవన భృతి అమలు చేయాలని యూనియన్ ఆధ్వర్యంలో చేసిన ఆందోళనల ఫలితంగానే ప్రభుత్వం బీడీ టేకేదారులకు జీవన భృతి అందజేస్తుందని ఒక ప్రకటనలో తెలిపారు.

మారనున్న ముధోల్ రాజకీయ సమీకరణలు

- రాజకీయాల్లోకి యువ వైద్యుడు కిరణ్



నవతెలంగాణ-ముధోల్

ముధోల్ నియోజకవర్గంలో రాజకీయ సమీకరణలు రోజురోజుకు మలుపులు తిరుగుతున్నాయి. నియోజకవర్గంలోని కుబీర్ మండలంలోని నిగ్వ గ్రామానికి చెందిన యువ వైద్యుడు డాక్టర్ కోమ్రెవార్ కిరణ్ కుమార్ రాజకీయాల పట్ల ఆసక్తి కనబర్చడంతో నియోజకవర్గంలో రాజకీయ వేడి ప్రారంభమైంది. నియోజక వర్గంలోని ఆయా మండలాల్లో డాక్టర్ కిరణ్ ఫౌండేషన్ ద్వారా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టారు. దీంతో నియోజకవర్గంలో ఆయన సుపరిచితుడిగా మారాడు. గత మూడు రోజుల కింద కాంగ్రెస్ నిర్మల్ కాంగ్రెస్ నాయకులు శ్రీహరిరావు ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డిని ఆయన కలిశారు. కాంగ్రెస్ పార్టీలోకి రావాలని పీసీసీ అధ్యక్షులు ఆహ్వానించాడు. అలాగే ముధోల్ రాజకీయ పరిస్థితులపై చర్చించారు. త్వరలో తాను భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని పేర్కొన్నారు. దీంతో రాజకీయంలో రావడానికి ఆసక్తి చూపుతున్నారు. అయితే ముధోల్ నియోజక వర్గంలో బీసీ నినాదం రానున్న ఎన్నికల్లో వినిపించాలని గత రెండు, మూడు నెలలుగా బీసీ సంఘ నాయకులు విస్తృతంగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారు. దీంతోనే రాజకీయంలోకి రావాలని నిర్ణయించుకున్నట్టు ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. ఆయన సామాజిక వర్గం చెందిన ఓటర్లు నియోజకవర్గంలో గెలుపు ఓటమిలో శాసించే స్థాయిలో ఉండటంతో, ఆయా పార్టీల రాష్ట్ర స్థాయి నాయకులు తమ పార్టీలోకి తేవటానికి ప్రయత్నం చేస్తున్నారు. అయితే ముఖ్యంగా కాంగ్రెస్ రానున్న ఎన్నికల్లో బీసీలకు అధికంగా ఎమ్మెల్యే సీట్లు కేటాయిస్తామని ప్రకటించటంతో బీసీ నాయకులు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఏదిఏమైనా ముధోల్ నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు రసవత్తరంగా మారనున్నాయి.

రైతులకు నష్ట పరిహారం అందించాలి

నవతెలంగాణ-సిరికొండ



అధిక వర్షాలతో నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించాలని పీసీసీ సభ్యులు, బోథ్ నియోజక వర్గ నాయకుడు ఆడే గజేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వర్ధను కలిసి వర్షాలతో నష్టపోయిన పంటలను పరిశీలించి, నష్టపోయిన వారిని ఆదుకోవాలని కోరారు. అనంతరం నారాయణ్‌పూర్ గ్రామంలో చెరువుకు గండి పడి భారీ నష్టం జరిగింది. పంటలను పరిశీలించి, రైతులకు బరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కురిసిన భారీ వర్షాలతో మట్టి మొత్తం కొట్టుకుపోయి భూసారం దెబ్బతిన్నదని, వరదలకు భూమి కోతకు గురై చాలా వరకు రైతులు నష్టపోయారని అన్నారు. రైతులు కుటుంబ భారాన్ని మోయలేక, పంట పొలాల్లో పంటలు లేక దీనావస్థలో రైతులు ఉన్నారని అన్నారు. నష్టపోయిన పంటలను కనీసం పరిశీలించకుండ, వారికి మనో ధైర్యాన్ని కూడా ఇవ్వడం లేదని అన్నారు. రైతు పక్షపాతి అని గొప్పలు చెప్పడం తప్ప చేసిందేమీ లేదన్నారు. అధికారులు సర్వే నిర్వహించి, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ తరపున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఇమామ్, ప్రధాన కార్యదర్శి బొడ్డు నవీన్, జింక మల్లేష్, విశ్వబొది పాల్గొన్నారు.

అప్రకటిత కరెంట్ కోతలపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్‌లో కరెంటు అప్రకటిత కోతలపై చర్యలు తీసుకోవాలని మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సబ్ ఇంజనీరు వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఖానాపూర్ పట్టణంలో తరచుగా విద్యుత్ శాఖ అధికారులు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ కోత విధించడంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉదయం వేళల్లో పాఠశాలలు కాలేజీలకు వెళ్లే విద్యార్థులకు ప్రభుత్వ అధికారులకు, న్యాయవాదులకు, వ్యాపార నిర్వాహకులకు అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. కరెంటు పనులు జరిగేటప్పుడు ముందస్తుగా పత్రిక ప్రకటనలు లేదా వాట్సాప్ గ్రూపులలో అయిన ప్రజలకు ప్రజా ప్రతినిధులకు సమాచారం అందించాలని అన్నారు. అలా ముందస్తు సమాచారంతో ప్రజలు ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటారనీ అన్నారు. ఇప్పటికైనా విద్యుత్ అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మండల అధ్యక్షులు డి.దయానంద్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాజురా సత్యం, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కౌన్సిలర్ కిషోర్ నాయక్, పార్టీ జనరల్ సెక్రటరీ షబ్బీర్ పాషా, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, నాయకులు కదార్ల గంగ నర్సయ్య, తోట సత్యం, సలీంఖాన్, జహీర్, సజ్జు, మురళి, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ ఎల్ఐసీ కార్యాలయం ఎదుట మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఏఐఈఈఏ, అధికారుల సంఘం క్లాస్-1 ఫెడరేషన్ సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐక్యకార్యాచరణ కమిటీ, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి కోవ దౌలత్‌రావు మొకాశి మాట్లాడుతూ పార్లమెంటులో ఎల్ఐసీ, ప్రభుత్వ సాధారణ బీమా సంస్థల్లో కుటుంబ పించన్‌లోకి పెంచే అంశంపై లేవనెత్తిన ప్రశ్నకు ఇచ్చిన సమాధానం విడ్డూరంగా ఉందని అన్నారు. దానిని వెంటనే వెనక్కి తీసుకోవాలని అన్నారు. వేంటనే 30శాతానికి పెంచే నోటిఫికేషన్ జారీ చేయాలని అన్నారు. నూతన పింఛన్ పథకం రద్దు చేసి, పాత పింఛను విధానాన్ని కోనసాగించాలని అన్నారు. వేతన సవరణ చట్టాలను తక్షణమే ప్రారంభించాలని, తక్షణమే ఎల్ఐసీలో నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కార్మిక చట్టాల అమలును, ప్రభుత్వ సంస్థలను ప్రయివేటు పరం చేయటాన్ని బీమా చట్టాల అమలును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఐసీఈయూ సంఘం అధ్యక్షులు జి.గణేష్, ఎల్ఐసీ క్లాస్-1 అధికారుల సంఘం అధ్యక్షులు జి.కృష్ణ, రాజారావు, శ్యాంరావ్, జగదిష్‌రెడ్డి, సాయి కృష్ణ, చంద్రశేఖర్‌గౌడ్, గోవర్ధన్ స్వామి, సుమాత్ కుమార్, రాజేంద్ర ప్రసాద్, నీలానంద్, నసీరుద్దీన్, ఫహీమ్, సిద్దిక్, శ్రీరాం పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు పూర్తి మద్దతు



- కాంగ్రెస్ నాయకులు డాక్టర్ నరేష్ జాదవ్

నవతెలంగాణ-బోథ్

బోథ్ మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని గత 16 రోజులుగా, రెవిన్యూ డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా దీక్షకు మంగళవారం కాంగ్రెస్ నాయకులు డాక్టర్ నరేష్ జాదవ్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్‌కు మా సహాయ సహకారాలు ఎల్లవేళ ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుంరం కోటేష్, జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, స్థానిక ఎంపీటీసీ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ నాగ్‌నాథ్ అప్పా, ఇచ్చోడ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆసిఫ్ ఖాన్, కాంగ్రెస్ బోథ్ ఎస్టీ సెల్ అ్యక్షుడు గంగారాం, నాయకులు సురేందర్, గంగాధర్, ఆరిఫ్ ఖాన్ గ్రామస్తులు పాల్గొన్నారు.

తప్పుడు కేసులుపెట్టి భయపెట్టలేరు

- కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న కాంగ్రెస్ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టిస్తూ భయపెట్టాలని చూస్తున్నారని, కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. బేల మండలం అవాల్‌పూర్‌లో తన వాహనాన్ని అడ్డగించి, దాడికి యత్నించడాన్ని ఖండిస్తూ నిరసన తెలిపిన కాంగ్రెస్ కార్యకర్తలపై కేసులు పెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. పోలీసుల వైఖరిని ఖండిస్తూ పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట కార్యకర్తలతో కలిసి ఆందోళనకు దిగారు. అక్రమంగా బనాయించిన కేసులను వెంటనే ఎత్తివేయాలంటూ డిమాండ్ చేశారు. ప్రశ్నిస్తే కేసులు పెట్టడం ప్రజాస్వామ్యమా అంటూ నిలదీశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్, రాందాస్ నాక్లే, సంజయ్ గుండావార్, వామన్‌రావు వాంకడే, మైనార్టీ సెల్ జిల్లా మాజీ చైర్మెన్ షకీల్, మానే శంకర్, అల్లూరి అశోక్‌రెడ్డి, వసీం రంజాని, రమేష్, కొండూరు రవి పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-కడెం

మండలంలోని కొండుకూర్ గ్రామంలో ఇటీవల వెంకటొరెడ్డి రిటైర్డ్ ఉద్యోగి మరణించగా విషయం తెలుసుకున్న నిర్మల్ జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు అజ్మీరా శ్యామ్ నాయక్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం అదే గ్రామానికి చెందిన చింతల గంగాధర్ ఇటీవల గుండె శస్త్ర చికిత్స చేసుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలిసి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం పాత కొండూరు గ్రామంలో మామిడిపల్లి లక్ష్మణ్ తండ్రి ఇటీవల మరణించగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట కొండుకూరు సర్పంచ్ వేణుగోపాల్, కడెం మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

తొలి మెట్టును విజయవంతం చేయాలి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని వద్యాల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో మంగళవారం ఎఫ్ఎల్ఎన్ మండల స్థాయి శిక్షణ తరగతులకు సంబంధించిన సన్నద్ధత కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలి మెట్టును విజయవంతం చేయాలని నోడల్ అధికారి కోరారు. ఈ నెల 2 నుంచి 8 వరకు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో బోధించే ఉపాధ్యాయులకు తొలిమెట్టు శిక్షణ కార్యక్రమం ఉదయం 9:30 నిమిషాల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి ఫహీం అధ్యక్షతన నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో వద్యాల్, లక్ష్మణచాంద స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అశోక్, వర్మమోహన్, మండల స్థాయి సీఆర్‌పీలు సుధాకర్, మహేందర్ పాల్గొన్నారు.

కుమ్మరి కులస్తులకు బీసీ రుణాలు రాకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం



నవతెలంగాణ-సిరికొండ

చేతి వృత్తులకు రుణాలు మంజూరు చేస్తున్నామని చెప్పి, ఇప్పటి వరకు మండలంలో ఒక్కరికీ కూడా బీసీ రుణాలు ఇవ్వలేదని, కుమ్మరి కులస్తులకు బీసీ రుణాలు రాకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ఆ సంఘం నాయకులు హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారమే రుణాలను మంజూరు చేయాలని అన్నారు. చేతి వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నామని అన్నారు. బీసీ రుణాలు ఇచ్చి ఆదుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి సంఘం మండల నాయకులు గణేష్, నెల్లుట్ల రాజేశ్వర్, రాజన్న, స్వామి, సురేందర్, సాయన్న, మల్లేష్, శంకర్, గంగాధర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సిడం సాయికుమార్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణంలోని బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో పర్యటించారు. మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు అపరిశుభ్రంగా ఉన్న ప్రిన్సిపల్ సమస్యలనూ పరిష్కరించకపోవడం సిగ్గు చేటని అన్నారు. గత సంవత్సరం నుంచి విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. సమస్యలను ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లిన ఆర్సిఓ ఐటిడిఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎలాంటి పరిష్కారం చూపించలేదని అన్నారు. వెంటనే విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి ఆందోళన చేపడుతామని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కుమ్ర అశోక్, రవి, రాజు ఉన్నారు.

కడెం యువకులకు ఘన సన్మానం

నవతెలంగాణ-కడెం

ఇటీవల వరదలకు కడెం ప్రాజెక్ట్ గేట్‌పై నుంచి వరద నీరు ప్రవహించిన పరిస్థితిలో స్థానిక యువత ఎంతో ధైర్యం ప్రదర్శించి, డ్యామ్ గేట్లు మాన్యువల్‌గా ఎత్తి ప్రాజెక్టుని ముంపు నుంచి కాపాడిన కడెం యువతను ఏఐసీసీ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్ నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం యువకులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వినోద్ నాయక్ మాట్లాడుతూ ప్రాజెక్ట్ అధికారులు చేతులెత్తేసిన స్థానిక యువత చాకచక్యంగా వ్యవహరించి ప్రాజెక్టుని కాపాడటంలో ముఖ్యపాత్ర పోషించారని అన్నారు. ఎంతో ధైర్యంతో గేట్లని మాన్యువల్‌గా పైకి ఎత్తి ఎంతో మంది ప్రాణాలు కాపాడిన యువతకు సన్మానం చేసుకొనే అదృష్టం మాకు రావడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మల్లేష్ యాదవ్, సలీం మహమ్మద్, వాజీద్, భూషణం, రఫీక్, బబ్లు, రమేష్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తున్న ఐటీ డిపార్ట్మెంట్ అధికారులు

నస్పూర్ : శ్రీరాంపూర్ డివిజన్‌లోని వివిధ గనుల డిపార్ట్మెంట్లలో ఉన్న కంప్యూటర్లు సంవత్సరం నుండి సరిగ్గా పని చేయక క్లరికల్ స్టాఫ్, సూపర్‌వైజర్‌లు, అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కంప్యూటర్లను కేటాయించడంలో ఐటీ డిపార్ట్మెంట్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీలు బాజీ సైదా వీరభద్రయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల సుమారు 70 కంప్యూటర్లను శ్రీరాంపూర్ డివిజన్‌కు కేటాయించడం జరిగిందని, కానీ వాటిని ముఖ్యమైన డిపార్ట్మెంట్లలో కేటాయించకుండా నామా మాత్రమే పని జరిగే చోట కేటాయించారని ఆరోపించారు. అలాగే ఇప్పుడే నేర్చుకుంటున్న పాలిటెక్నిక్ విద్యార్థులకు కొత్త కంప్యూటర్లను కేటాయించి, కాలేజీలో వినియోగించిన వాటిని సింగరేణిలో వినియోగిస్తున్న ఎస్ఏపీ కోసం గనులు వినియోగించడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు వెంటనే తగు చర్యలు తీసుకొని అత్యవసరం ఉన్న ప్రదేశాల్లో మొదటి విడతలో కొత్త కంప్యూటర్లను కేటాయించాలని కోరారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం



రెబ్బెన : బెల్లంపల్లి ఏరియాలో నుండి కార్పొరేట్ వెల్ఫేర్‌కు బదిలీపై వెళ్తున్న సీనియర్ పర్సనల్ అధికారి జీకె కిరణ్‌కుమార్‌ను పర్సనల్ డిపార్టుమెంట్ ఉద్యోగులు మంగళవారం శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పర్సనల్ మేనేజర్ ఐ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాలో సీనియర్ పర్సనల్ అధికారిగా జీకె కిరణ్‌కుమార్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమాల ఏర్పాటు, నిర్వహణను చిత్తశుద్ధితో పనిచేశారని అన్నారు. అన్ని డిపార్టుమెంట్ల అధికారులు, ఉద్యోగులతో ఆయనను శాలువాలతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్‌కుమార్ బెహెరా, డీవైపీఎం రెడ్డిమల్ల తిరుపతి, జూనియర్ అసిస్టెంట్లు బాబా, డి రమ్య, తిరుమల, శ్రీలేఖ, కె రమ్య పాల్గొన్నారు.

35 స్థానాల్లో బీసీలు ఎమ్మెల్యేలుగా గెలవాలి



నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ రాష్ట్రంలో 35 మంది బీసీ ఎమ్మెల్యేలు గెలిస్తే బీసీ ముఖ్యమంత్రి పదవి ఖాయమని బీసీ కులాల పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరు చంద్రయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పత్రిక విలేకరులతో మాట్లాడారు. స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరములు గడిచినప్పటికీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గాని తర్వాత ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో గాని బీసీ కులాల నుండి ముఖ్యమంత్రి గాని కనీసం ఉపముఖ్యమంత్రి గాని అయ్యే అవకాశం లభించడం లేదన్నారు. భవిష్యత్తులో నాలుగు నెలల తర్వాత జరిగే అసెంబ్లీ ఎన్నికలలో బీసీ కులాల నుండి ప్రముఖ నాయకులు ప్రయత్నిస్తే బీసీల ప్రభుత్వం ఏర్పడటానికి మెండుగా అవకాశాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో 119 సీట్లలో ఎస్సీ, ఎస్టీలు రిజర్వేషన్ల కింద 30 మంది ఎమ్మెల్యేలుగా గెలుస్తున్నందున బీసీల నుంచి 35 మంది ఎమ్మెల్యేలు గెలిస్తే 65 మందితో బీసీల ప్రభుత్వం ఏర్పాటు అవుతుందన్నారు. బీసీ ముఖ్యమంత్రి అయితే ఎస్సీ ఎస్టీ దళితులందరికీ న్యాయం జరుగుతుందన్నారు. అందుకు అందరు ఐక్యంగా ఉండి పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు కేప నర్సింహులు, కడార్ల నర్సయ్య, ఆడెపు లక్ష్మీనారాయణ, కాశెట్టి లక్ష్మణ్ మూల భాస్కర్ గౌడ్, చెట్‌పెల్లి గంగయ్య, శ్రీరామంల గంగాధర్, ఐలవేని రవి, కోడి జుట్టు రాజయ్య, ఎంబడి సత్తన్న, మామిడి విజయ్ పాల్గొన్నారు.

కార్మిక కార్డులో పాత విధానాన్ని అమలు చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చే గుర్తింపు కార్డుతో పాటు ఇన్సూరెన్స్ కార్డు విషయంలో పాత విధానాన్ని అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకిషన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని భవన నిర్మాణ కార్మిక సంఘ భవనంలో కార్మికులకు కార్మిక శిక్షణ అధికారి రవి నేతృత్వంలో కార్మిక చట్టాలపై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులు ప్రతి ఒక్కరు ఇన్సూరెన్స్ కార్డుతో పాటు గుర్తింపు కార్డు చేయించుకోవాలన్నారు. అయితే దీనిలో వేలిముద్ర విధానంతో కొత్త విధానాన్ని అమలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. దీనివల్ల కార్మికులు ఇబ్బంది పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పాత విధానాన్ని అమలు చేయాలని కార్మికుల కష్టాలను గుర్తించాలన్నారు. శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని కార్మికులు చట్టాలపై అవగాహన తెచ్చుకోవాలన్నారు. శిక్షణ కార్యక్రమానికి హాజరైన వారికి ప్రభుత్వం నుండి ప్రత్యేక సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు కొఠారి కమలాకర్, జిల్లా కోశాధికారి కవాల్కర్ ఆనందరావు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-జన్నారం

రైతుబీ మాకు కొత్తగా పట్టాపాస్ బుక్కులు వచ్చిన రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని, మండలంలోని సింగరాయపేట క్లస్టర్ ఏఈఓ సాయి తెలిపారు. మంగళవారం తిమ్మాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ జాడి గంగాధర్‌తో కలిసి రైతుబీమా లబ్ధిదారుల జాబితాను గోడకు అంటించారు. ఆ జాబితాలో ఉన్న రైతులు తప్పకుండా ఈ నెల 5వ తేదీలోపే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తాండూర్ : కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు జూన్ 18, 2023 లోపు పొందిన రైతులు రైతుభీమా కు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా వ్యవసాయ అధికారి కిరణ్మయి తెలిపారు . 18-59 సంవత్సరాల వయస్సు గల రైతులు అంటే 14.08.1964 నుండి 14.8.2005 మధ్య జన్మించినవారు రైతు భీమా నమోదుకు అర్హులనితెలిపారు. ఆగస్టు 5, లోపు దరఖాస్తు ఫారం పటాదారు పాస్ బుక్ రైతు ఆధార్ కార్డ్, నామినీ ఆధార్ కార్డ్‌తో సంప్రదించాలని ఆమె కోరారు.

దినసరి కూలీల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ డైలీ వేజ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టేకం ప్రభాకర్ డిమాండ్ చేశారు. జిల్లాలో నూతనంగా గిరిజన సంక్షేమ శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన రమను సీఐటీయూ జిల్లా నాయకుడు కృష్ణమాచారి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైలీ వేజ్ వర్కర్లకు వేతనాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల వేతనాలు వెంటనే చెల్లించేలా చూడాలన్నారు. కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు సమస్యలు పరిష్కరించాలని కోరారు. తమ పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కరిస్తానని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని హామీ ఇచ్చినట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి అరిగెల కోటయ్య, నాయకులు శ్యాంరావ్, రాంబాయి, మాంకు, వనిత, హీరాబాయి, సురేందర్, మాంకూబాయి పాల్గొన్నారు.

స్కూల్ స్వీపర్ల సమ్మెకు ప్రభుత్వం స్పందించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్ కుమార్



నవతెలంగాణ-హాజీపూర్

ప్రభుత్వ స్కూల్ స్వీపర్స్ సమ్మెపై ప్రభుత్వం స్పందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అన్నారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె 10వ రోజు నిరసన కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ కార్యాలయం నుండి హైవే చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అధికారంలోకి వచ్చి సంవత్సరాలు గడుస్తున్నా కార్మికుల సమస్యలు పరిష్కరించకపోవడం చాలా దారుణం అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని అసెంబ్లీ సమావేశాల్లో స్కూల్ స్వీపర్లను పర్మినెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. చనిపోయిన వర్కర్ల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తూ, ఆ కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ స్వీపర్స్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, నారాయణ, వెంకటేష్, గంగన్న, వెంకటేష్ ,లింగన్న, పద్మ, బయ్యన్న, సత్తన్న, రామన్న, శంకర్, గంగమ్మ, రాజమ్మ పాల్గొన్నారు.

తల్లిపాల విశిష్టతను తెలియజేయాలి



కాసిపేటలో..

నవతెలంగాణ-తాండూర్

గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టతపై అంగన్‌వాడీ కార్యకర్తలు వివరించాలని ఐటీడీఎస్ సూపర్‌వైజర్ మమత సూచించారు. మంగళవారం రాజీవ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆగస్ట్1 నుంచి 7వ తేదీ వరకు జరిగే తల్లిపాల వారోత్సవాల్లో బాలింతలకు గర్భిణీలకు మహిళలకు తల్లిపాల విశిష్టతను వివరించారు. తల్లిపాలతో బిడ్డలో రోగ నిరోధక శక్తి పెంపొందుతుందని తెలిపారు. తల్లి ప్రసవమైన గంటలో ఇచ్చే పాలలోపోషకాలు ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయని తెలిపారు. తల్లి ముర్రుపాలను పిల్లలకు తప్పకుండా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్ సుజాత పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలపై అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు, ఏఎన్ఎంలకు అవగాహన కార్యక్రమం ఐటీడీఏ సూపర్‌వైజర్ హసీనా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి నుండి ఏడో తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. శిశువు పుట్టిన వెంటనే గంటలోపు తల్లి యొక్క ముర్రుపాలు తాగించాలని, ముర్రు పాలు తాగడం వల్ల చిన్నారులలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా రెండు సంవత్సరాలపైన ఉన్న వారందరికి ఎత్తు, వయసును బట్టి అల్బెండజోల్ మాత్రలు అందించాలని ఆమె ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ అనార్తి, హెల్త్ సూపర్‌వైజర్ విక్టోరియా, ఫార్మాసిస్టు రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ ధర్మారావు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాసిపేట : మండలంలోని రేగులగూడ గ్రామంలోని మంగళవారం అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక మాట్లాడుతూ ప్రతి ఏడాది ఆగస్టు మొదటి వారంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. బిడ్డ ఆరోగ్యానికి తల్లిపాలు సంపూర్ణమైన ఆహారాన్ని అందిస్తాయని, బిడ్డ పుట్టిన అరగంటలోపు తల్లులకు వచ్చే ముర్రుపాలు బిడ్డలకు రోగ నిరోధక శక్తిని అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.



పెంచికల్‌పేట్‌లో..

అభయారణ్యంలో పర్యటించిన అధికారులు




నవతెలంగాణ-జైపూర్

శివ్వారం మొసళ్ల అభయారణ్యం గోదావరి నది అందాలను మంగళవారం జిల్లా అధికారులు సందర్శించారు. మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్‌తో పాటు అదనపు కలెక్టర్ రాహుల్, గౌతమి, మంచిర్యాల డీసీపీ సుధీర్ కేకన్, జిల్లా అటవీ అధికారి అశిశ్ సింగ్‌లు మొసళ్ల అభయారణ్యంలో పర్యటించారు. 30 చదరపు కిలో మీటర్లు (2981.68) హెక్టార్లలో విస్తీర్ణంలో గల ఈ అభయారణ్యంలో గల ప్రత్యేకతలను అటవీ అధికారులు వివరించారు. ఇక్కడున్న వృక్ష సంపద, ఎల్ మడుగులో ఆవాసమైన మొసళ్లతో పాటు రకరకాలైన జీవులు, పర్యాటకుల సౌకర్యార్థం అటవీశాఖ ఏర్పాటు చేసిన సౌకర్యాలు వెల్లడించారు. వృక్ష జంతు జాతుల సంరక్షణ కోసం శాఖ పరంగా తీసుకుంటున్న ప్రత్యేక సంరక్షణ చర్యలు వివరించారు. కాగా ఇటీవల కురిసిన భారీ వర్షాలతో అతలాకుతలమైన గోదావరి తీర ప్రాంత పరిస్థితులు వివరించిన స్థానిక సర్పంచ్ ఆవిడపు గణేష్ ఎల్ మడుగు ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి పర్చాలని కోరారు. చెన్నూర్-శివ్వారం మధ్యన గల ఆర్‌అండ్‌బీ రోడ్డు నుండి ఎల్ మడుగు వరకు బీటీ రోడ్డు నిర్మించడం, ఎల్ మడుగు వద్ద పర్యాటకుల సౌకర్యార్థం బోటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. ఇక్కడి గోదావరి అందాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాలను వచ్చే పర్యాటకులు గోదావరిలో బోటింగ్ లేక నిరుత్సాహానికి గురవుతున్నారని వివరించారు. సర్పంచ్ అభ్యర్థన పట్ల స్పందించిన జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ బీటీ రోడ్డు కాకపోయినా అభివృద్ధిపర్చుటకు సహకరిస్తామని, బోటింగ్ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ గణేష్ తెలిపారు. ఎల్ మడుగును సందర్శించిన జిల్లా అధికారులతో పాటు చెన్నూర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, శివకుమార్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బాలకృష్ణ, జైపూర్ తహసీల్దార్ మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ సత్యనారాయణ, స్థానిక ఎస్సై ఉపేందర్‌రావు, ఎంపీఓ అనిల్ కుమార్ ఉన్నారు.

శ్రీరాంపూర్ ఏరియాలో 72 శాతం బొగ్గు ఉత్పత్తి

నవతెలంగాణ-నస్పూర్



శ్రీరాంపూర్ ఏరియాలో జులై నెలలో 72 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి తెలిపారు. మంగళవారం జనరల్ మేనేజర్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. జులై నెలలో నిర్దేశించిన 4 లక్షల 48,500 టన్నుల ఉత్పత్తికి గాను 3,21,536 టన్నులు సాధించి 72 శాతం ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. జులై నెలలో వర్షాల కారణంగా ఉపరితల గనుల్లో ఉత్పత్తి శాతం తగ్గిందని పేర్కొన్నారు. స్వచ్ఛత పక్వాడాలో సింగరేణి వ్యాప్తంగా శ్రీరాంపూర్ ఏరియాకు మొదటి బహుమతి వచ్చిందని తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-8 డిస్పెన్సరీలో సుమారు రూ.1,60,000తో నూతన హెచ్‌బీఏ1సి అనలైజర్‌ను ప్రారంభించడం జరిగిందని, ఈ సంవత్సరం 18 రక్తదాన శిబిరాలను నిర్వహించామని, అందులో 720 మంది ఉద్యోగుల రక్తదానం చేసారని పేర్కొన్నారు. రెండు రోజుల్లో చేంజ్ ఆఫ్ కోటర్ కౌన్సిలింగ్‌లో 119 మంది ఉద్యోగులకు క్వార్టర్లను ఇచ్చామన్నారు. ఇప్పటి వరకు శ్రీరాంపూర్ ఏరియాలో 3353 మందికి అందజేశామని, సింగరేణి వ్యాప్తంగా 11311 మందికి కారుణ్య నియామక పత్రాలు జారీ చేయడం జరిగిందన్నారు. 11వ వేజ్ బోర్డును సింగరేణి వ్యాప్తంగా ఉద్యోగులకు విజయవంతంగా అందజేయడం జరిగిందని, పెన్షన్ పొందుతున్న వారు ఫార్మర్, సర్వేయర్ సర్టిఫికెట్ గని, సంబంధిత విభాగాలలో అందజేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం రఘు కుమార్, డీజీఎం (ఐఈడీ)చిరంజీవులు, ఇన్‌ఛార్జి డీజీఎం(ప) రాజేశ్వరరావు, సీనియర్ పిఓ కాంతారావు పాల్గొన్నారు.

కులవృత్తుల రుణాలు సకాలంలో అందించాలి

రెబ్బెన : కులవృత్తులను ఆదుకుంటామని ప్రభుత్వం ఇటీవల ఇచ్చిన హామీని వెంటనే అమలుచేయాలని మేర సంఘం జిల్లా నాయకులు రాయిల్ల నర్సయ్య డిమాండ్ చేశారు. మండలంలోని గోలేటిలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రుణాల దరఖాస్తులు ముగిసి రెండు నెలలు గడుస్తున్నా వాటిపై ప్రభుత్వ ఊసే లేదన్నారు. ప్రభుత్వం తాత్సారం చేయకుండా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి రుణాలు అందించాలన్నారు. అర్హులైన అభ్యర్థులకు వెంటనే రుణాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎలక్షన్ కోడ్ రాకముందే అర్హులైన అభ్యర్థులకు సకాలంలో రుణాలు అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

సోమగూడెంలో క్లోరినేషన్ పనులు

నవతెలంగాణ-కాసిపేట

సోమగూడెం భరత్ కాలనీ గ్రామ పంచాయతీలో సర్పంచ్ కొరికొప్పుల ప్రమీలా గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం క్లోరినేషన్ పనులు చేపట్టారు. వర్షం పడుతుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకంగా ముందస్తు చర్యల్లో భాగంగా పంచాయతీలోని పలు కాలనీల్లో క్లోరినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలువల్లో, నీటి నిలువ ఉన్న ప్రాంతంలో బ్లీచింగ్ పౌడర్ను చల్లించారు. పాత సామాగ్రిలో నీరు నిలువ ఉంచకుండా చూసుకోవాలని, పరిసరాల శుభ్రత పాటించాలని, దీంతో దోమల వృద్ధి చెందకుండా ఉంటాయని, దీని వల్ల ఆరోగ్యంగా ఉంటామని పేర్కొన్నారు.

సింగరేణి సీఎండీని కలిసిన ప్రభుత్వ విప్



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

మందమర్రి, రామకృష్ణాపూర్ సింగరేణి ఏరాఇయాల్లో నెలకొన్న సమస్యలను సింగరేణి సీఎండీ శ్రీధర్‌బాబుకు ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ వివరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సీఎండీని కలిశారు. నిధులు మంజూరై కొనసాగుతున్న పనులు మరింత వేగవంతం చేయవలసిందిగా కోరారు. రామకృష్ణాపూర్ పట్టణంలో జీఓ నెం 76 ద్వారా అందిస్తున్న ఇండ్ల పట్టాలకు సంబంధించి గతంలో చేసిన సర్వేలో పలు కారణాల వల్ల మిస్ అయిన భగత్ సింగ్‌నగర్, రాజీవ్‌నగర్, శివాజీ నగర్, జవహర్‌నగర్, శ్రీనివాస్‌నగర్, మల్లికార్జుననగర్, గంగాకాలనీ, విద్యానగర్, ఆర్కే-4 గడ్డ, పోస్ట్ ఆఫీస్ లైన్‌లకు చెందిన భూముల క్రమబద్ధీకరణ చేయుటకు రెవెన్యూ డిపార్ట్‌మెంటుకు అందించవలసిందిగా కోరడం జరిగినది. దీనివల్ల అదనంగా మరో 1200 గృహాలకు పట్టాలు అందించనున్నామని తెలిపారు. ఇప్పటికే పట్టణంలో ఆరు విడతల్లో 3035 గహాలకు పట్టాలు అందించామని తెలిపారు. అలాగే క్యాతనపల్లి మున్సిపాలిటీ రెండవ వార్డ్ జ్యోతినగర్‌లో నిర్మించనున్న కేసీఆర్ అర్బన్ ఎకో పార్క్ కోసం సింగరేణి నుండి 30 ఎకరాల భూమి అప్పగించాలని కోరారు. ఎమ్మెల్యే బాల్క సుమన్ తెలిపిన పలు అంశాలపై సింగరేణి సీఎండి శ్రీధర్ సాలకూలంగా స్పందించారు.

అన్నాబావుసాఠెకు ఘన నివాళి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

అన్నాబాహుసాఠె 103వ జయంతి సందర్భంగా మంగళవారం మండలకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బీఎస్‌పీ మండల అధ్యక్షుడు పాగిడె ఆశన్న ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కవి, రచయిత అయినటువంటి సాఠె అడుగుజాడల్లో నడవాలన్నారు. ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదని, అడా ప్రాజెక్టు వరదతో దహెగాం, పెంచికల్‌పేట్ రైతులు మూడు సంవత్సరాల నుండి పంటలను నష్టపోతున్నారని, పంటలు నష్టపోవడంతో పాటు భూమి కోతకు గురై చేన్లలో ఇసుక మేటలు వేస్తున్నాయన్నారు. కమ్మర్‌గాం, మురళీగూడకు రహదారి సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఎల్లూరు గ్రామంలో చర్చి నుండి కొత్తగూడ వరకు రోడ్డు నేటికి వేయక ప్రజలు బురదలో ఇబ్బందులు పడుతున్నారని, రైతులకు మూడెకరాల భూమి, డబుల్‌బెడ్‌రూం ఇండ్లు ఎవరికి రాలేదని అన్నారు. వరదల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవడంలేదని, అధికారులు సర్వేలు చేపడుతున్నారు తప్ప పరిహారం అందడంలేదన్నారు. కార్యక్రమంలో బీఎస్‌పీ తాలుకా ప్రధాన కార్యదర్శి బాబాజీ, సోషల్ మీడియా కన్వీనర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి ఆర్టీసీ కార్మికుల పాలాభిషేకం

నవతెలంగాణ-రెబ్బెన

సీఎం కేసీఆర్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ప్రకటించిన సందర్భంగా ఆర్టీసీ కార్మికులు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం మండలకేంద్రంలోని గెస్ట్‌హౌజ్ ముందు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆర్‌టీసీ కార్మికులు మాట్లాడుతూ గతకొన్ని సంవత్సరాలుగా నెలకొన్న సమస్యను సీఎం కేసీఆర్ పరిష్కరించడంతో ధన్యవాదాలు తెలిపారు.

ఆపరేషన్ ముస్కాన్‌తో 73 మంది బాలలకు రక్షణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలో రెండు విడుతల్లో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ 9లో భాగంగా జనవరి నెలలో ఆపరేషన్ స్మైల్ ద్వారా 43 జూలైలో ఆపరేషన్ ముస్కాన్ ద్వారా 30 మంది బాల బాలికలకు రక్షణ కల్పించినట్లు జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జూలై నెలపాటు నిర్వహించిన బాల కార్మికుల నిర్మూలన కోసం చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ మంచి ఫలితాలు ఇచ్చిందన్నారు. బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 18 ఏళ్లలోపు ఉన్న బాలలను పనిలో పెట్టుకున్న యజమానులకు జరిమాణాలు విధించామన్నారు. తల్లిదండ్రులకు పోలీసుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. వీటితో పాటు ఆయా ప్రాంతాల్లోని చిన్నారుల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి మళ్లీ పిల్లల్ని పనిలో పెట్టుకుంటే తీసుకునే చర్యలపై అవగాహన కల్పించారన్నారు. ఎవరైనా బాలకార్మికులను గుర్తించినవారు డయల్ 100 లేదా 1098 కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. ఆపరేషన్ ముస్కాన్‌కు సహకరించిన అన్ని విభాగాలకు అభినందనలు తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమానికి ఆసిఫాబాద్ డివిజన్‌లో ఇన్‌ఛార్జిగా హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, కాగజ్‌నగర్ డివిజన్ లో ఎస్సై కళ్యాణ్‌లు ఇన్‌ఛార్జీలుగా వ్యవహరించారని అన్నారు.

పోరాట ఫలితంగానే ఆర్టీసీ విలీన ప్రకటన

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్

నవతెలంగాణ-రెబ్బెన

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ రాష్ట్ర కెబినేట్ నిర్ణయం తీసుకోవాడం కార్మికుల చేసిన పోరాట ఫలితమేనని, ఆ నిర్ణయాన్ని ఏఐటీయూసీ స్వాగతిస్తోందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో ఆర్టీసీ ఎంప్లాయీస్, జేఏసీ నాయకులు ఎండీ తహేర్ ఆధ్వర్యంలో ఆర్‌టీసీ కార్మికులు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది కార్మికుల విజయమని, ఉమ్మడి రాష్ట్రంలో ఏఐటీయూసీ అనుబంధ సంఘమైన టీఎస్ఆర్‌టీసీ ఎంప్లాయీస్ యూనియన్ గుర్తింపులో ఉన్నప్పుడే ఆనాటి రవాణా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆర్‌టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడాన్ని కమిటీ వేయించి హర్యానా, పంజాబ్, ఛండీఘర్‌లో పర్యటించి వచ్చారని, ఆ తర్వాత రాష్ట్రం విడిపోయి ఆర్‌టీసీ విడిపోవడం జరిగిందన్నారు. 2019లో తెలంగాణలో విలీనం ప్రథమ డిమాండ్‌గా పెట్టి సమ్మె చేసిన సందర్భంలో ముఖ్యమంత్రి తీవ్రంగా వ్యతిరేకించారని, అసలు ఆర్టీసీలో యూనియన్‌లు అవసరంలేదని, వెల్ఫేర్ కమిటీలు వేశారు. అప్పటి నుండి కార్మికులు పడుతున్న ఇబ్బందులు, సమస్యల పరిష్కారానికి ఎంప్లాయీస్ యూనియన్ నిరంతరం పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినందుకు ఆర్టీసీ కార్మికులు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు

వర్ష ప్రభావ ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలో వర్ష ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జడ్పీటీసి నాగేశ్వరరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇటీవల కురిసిన వర్షాలు, వరదలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులు కురిసిన వర్షాలతో ఇబ్బందిపడ్డ బాధితులకు చేయూత అందించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ప్రసాద్, తహసీల్దార్ రామ్మోహన్‌రావు, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ సెక్రటరీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యం లోపించకుండా చూడాలి

నవతెలంగాణ-నార్నూర్

గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చూడాలని డీఎల్పీఓ భిక్షపతిగౌడ్ సూచించారు. మంగళవారం మండలంలోని జామడ, గంగాపూర్, మాన్యాపూర్ గ్రామపంచాయతీలో తిరుగుతూ పరిసరాలను, పారిశుధ్య పనులను పరిశీలించారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం గ్రామపంచాయతీలో వివిధ రికార్డులను తనిఖీ చేశారు. పూసిగూడ గ్రామంలో వైద్య సిబ్బంది నిర్వహించిన ఆర్ఎఫ్ఎస్ క్యాంప్‌ను సందర్శించారు. అనంతరం మండల కేంద్రంలో టిపి కార్యదర్శులతో వివిధ అంశాలపై సమావేశం నిర్వహించారు. ఆయన వెంట ఎంపీడీఓ రమేష్, ఎంపిఓ మహేష్, సర్పంచులు ముక్తా రూపదేవ్, రాథోడ్ సావిందర్, కార్యదర్శులు రాధిక, లవకుమార్, ముండే రమేష్, హెల్త్ సూపర్వైజర్ చరణ్‌దాస్, సుశీల, సింధు, ఆశ రత్నమాల ఉన్నారు.

బీడీ కార్మికులందరికీ జీవనభృతి ఇవ్వాలి



నవతెలంగాణ-హాజీపూర్

బీడీ కార్మికులకు, ప్యాకర్స్‌కి, చటన్, బట్టి కార్మికులకు, బీడీ కమిషన్ ఏజెంట్లకు జీవన భృతిని ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాన్ని ఐఎఫ్‌టీయూ స్వాగతిస్తోందని ఆ సంఘం నాయకులు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ 2015 నుంచి ఇప్పటివరకు జీవన భృతి రాకుండా పనిచేస్తున్న బీడీ కార్మికులు, బీడీ ప్యాకర్లు, కమిషన్ ఏజెంట్లకు జీవనభృతిని ఇవ్వాలని అనేక పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. కలెక్టర్లు, ఎమ్మెల్యే, మంత్రులలను కలిసి అనేక సార్లు వినతి పత్రాలు ఇచ్చామని గుర్తు చేశారు. మండలాల నుంచి మొదలుకుంటే రాష్ట్రస్థాయి వరకు వేలాది మందితో అనేక కార్యక్రమాలు నిర్వహించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు పోయేలా కృషి చేశామన్నారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం జీవన భృతిని ఇస్తామని ప్రకటించడం హర్షదాయకం అన్నారు. వెంటనే ఎటువంటి ఆంక్షలు లేకుండా, 50 సంవత్సరాల నిబంధనను ఎత్తివేసి బీడీ పరిశ్రమల్లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి జీవన భృతిని ఆగస్టు నెల నుండి ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.జ్యోతి, దారిశెట్టి అరుణ, ఎం.మల్లన్న ఐఎఫ్‌టీయూ టి.శ్రీనివాస్, టి.తిరుపతి, మేఘన, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బోధకాలు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బోధకాల వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్ఈవో శ్యామ్‌లాల్ తెలిపారు. తల్లిపాల వారోత్సవాల ప్రారంభోత్సవంలో భాగంగా అడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బోధకాల వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 10 నుండి డిఈసి మాత్రలు రెండు సంవత్సరాల పైబడిన వారికి అందజేయడం జరుగుతుందన్నారు. మాత్రలు వేసిన వారి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అన్ని రకాల విద్యాసంస్థల్లో మాత్రలు అందజేయాలన్నారు. నిర్దేశించిన విధానాల ప్రకారం 2 నుంచి 5 సంవత్సరాలు వారికి ఒక మాత్ర, 6 నుండి 14 సంవత్సరాల వారికి రెండు మాత్రలు, 15 నుండి 19 సంవత్సరాలు ఆపైన వారికి మూడు మాత్రలు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ ఉత్తమ్ రాథోడ్, అంగన్వాడి కార్యకర్తలు సోంబాయి, సుజాత పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 170 మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించామని వైద్యురాలు గంగాదేవి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 170 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 20 మందికి కండ్ల కలక సోకినట్టు నిర్ధారించామన్నారు. ఆ విద్యార్థులకు ఐ డ్రాప్స్, మందులు పంపిణీ చేశామన్నారు. విద్యార్థులకు ఒకరి నుండి ఒకరికి కండ్ల కలక సోకకుండా ఎలా జాగ్రత్తలు తీసుకోవాలో తెలిపామన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఓ రమేష్, సూపర్వైజర్ రాంబాబు, ఆరోగ్య కార్యకర్త సుభక్త, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు శ్యాంరావు పాల్గొన్నారు. రాంపూర్ గ్రామంలోనూ వైద్య శిబిరం నిర్వహించి గ్రామస్తులకు రక్త, బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో డ్రై డే నిర్వహించి పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల గురించి తెలియజేశారు. వ్యాధులు రాకుండా ఎలా అరికట్టాలో తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఈఓ సందీప్, ఆరోగ్య కార్యకర్తలు కొల్లూరి కమలాకర్, అపరంజి, ఆశా కార్యకర్త వసంత పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ కోసం ఎంపిక పరీక్ష

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో యూపీఎస్సీ పరీక్షల కోసం అవసరమైన కోచింగ్ ఇవ్వడానికి ఉచిత శిక్షణ కోసం వచ్చే వారికి 28న ఎంపిక పరీక్ష నిర్వహిస్తామని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి సజీవన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వంద మంది అభ్యర్థులకు శిక్షణ ఇస్తామని, దీనికోసం ఆగస్టు 13లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ - దహెగాం

రైతుబీమాకు అర్హులైన రైతులు ఆగస్టు ఐదో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ వెన్నెల అన్నారు. మంగళవారం మండలంలోని ఐనం గ్రామంలో రైతుబీమా దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుబీమాకు అర్హులైన రైతుల జాబితాను గోడలకు అంటించడం జరిగిందని, తప్పకుండా ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏదైన అనుకోని ప్రమాదం జరిగి రైతు మరణిస్తే వారి కుటుంబానికి రూ.5లక్షల ప్రభుత్వ సాయం అందుతుందన్నారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బెజ్జూర్: రైతుబీమా పథకానికి ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని రైతులు ఈ నెల ఐదో తేదీలోగా దరఖాస్తులు వ్యవసాయ అధికారి కార్యాలయంలో అందజేయాలని కాటేపల్లి వ్యవసాయ విస్తరణ అధికారి మారుతి తెలిపారు. మంగళవారం మండలంలోని కాటేపల్లి గ్రామంలో రైతుబీమా దరఖాస్తులను స్వీకరించారు. అర్హులైన రైతులందరు పట్టా పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డ్, నామిని ఆధార్‌కార్డ్ జిరాక్స్ ప్రతులతో స్వయంగా రైతే ఏఈఓను సంప్రదించి అందజేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భీంరావు, కారోబార్ జలపతి, సిడాం సకారాం రైతులు పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ప్రొహిషన్ అండ్ ఎక్సైజ్ (అబ్కారీ) కాగజ్‌నగర్ స్టేషన్ పరిధిలో నాటుసారాయి, నల్ల బెల్లం, మద్యం, దేశీదారు రవాణా కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను ఈ నెల 3న వేలం నిర్వహించనున్నట్టు ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ మంగమ్మ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు నిర్ణీత ధరలో సగం చెల్లించి పాల్గొనాల్సి ఉంటుందని అన్నారు.

కార్యదర్శులకు, సర్పంచ్‌లకు అవగాహనా సదస్సు

నవతెలంగాణ - వాంకిడి

మండల పరిషత్ కార్యాలయంలో ఇటీవల కురిసన భారీ వర్షాల కారణంగా జరిగిన ప్రకృతి వైపరీత్యాలపై సర్పంచ్‌లకు, కార్యదర్శులకు, ఐకేపీ సిబ్బందికి మంగళవారం అవగాహన కల్పించారు. భారీ వర్షాల నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో ప్రతి రోజు స్ప్రే చేయాలని, చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఎప్పటికప్పుడు గ్రామాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా, వ్యాధుల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత కార్యదర్శులు, సర్పంచ్‌లపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ముండె విమలాబాయి, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏపీఓ శివకుమార్, వైద్యాధికారి వినయ్, సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఐకేపీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

నవతెలంగాణ-జన్నారం



ఆటో డ్రైవర్ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో యూనియన్ అసోసియేషన్ మండల ఉపాధ్యక్షుడు రత్నం మాణిక్యం అన్నారు. మంగళవారం మండలంలోని మురిమడుగు గ్రామంలో ప్రపంచ ఆటో డ్రైవర్ కార్మికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం సబ్సిడీతో ఆటోలను అందించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ ఆటో డ్రైవర్లు నర్సిములు, రవి గంగన్న రాజేందర్ పాల్గొన్నారు.

నస్పూర్ : మున్సిపాలిటీ పరిధిలో పలుచోట్ల అంతర్జాతీయ ఆటో డ్రైవర్ల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. నస్పూర్ సీసీసీ కార్నర్‌లో బీఆర్ఎస్ బీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి, నస్పూర్ టౌన్ ఆటో యూనియన్ అధ్యక్షుడు చెల్లా విక్రమ్ ఆధ్వర్యంలో, షర్కే సెంటర్‌లో ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, శ్రీరాంపూర్ ప్రజాసేవ ఆటో యూనియన్ అధ్యక్షుడు చిలుక మల్లేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

రామకృష్ణాపూర్ : ఆటో డ్రైవర్లను వేధింపులకు గురిచేస్తున్న కొన్ని ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలపై చర్యలు తీసుకోవాలని రిపబ్లికన్ అసోసియేషన్ అధ్యక్షులు, న్యాయవాది రాజలింగు మోతె డిమాండ్ చేశారు. మంగళవారం ప్రపంచ ఆటో డ్రైవర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక రవీంద్రఖని రైల్వే స్టేషన్ వద్ద ఆటో డ్రైవర్లతో కలిసి రాజలింగు మోతె మాట్లాడారు. ఆటోలకు ఫైనాన్స్ ఇచ్చే కొన్ని సంస్థలు ఆటో డ్రైవర్లను తీవ్ర వేదింపులకు గురి చేస్తున్నారని అన్నారు. వారి ఆగడాలకు అంతేలేకుండా పోయిందని, వాయిదాలు మీరితే మితిమీరిన జరిమానాలు విధిస్తున్నారని తెలిపారు. జిల్లా కేంద్రంలో ప్రైవేట్ ఫైనాన్స్ వ్యాపార సంస్థలు పుట్టగొడుగుల్ల వెలుస్తున్నాయన్నారు. వాయిదాలు చెల్లించాలని ఆటో డ్రైవర్లను ఒత్తిడి చేస్తున్న అక్రమ ఫైనాన్స్ సంస్థలపై సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే ప్రభుత్వం నిరుపేద ఆటో డ్రైవర్లకు రెండు పడకల గదులను మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు దర్శు రామ్ కుమార్, పినుమల్ల మహేష్, తర్య నాయక్, పాషా అజ్జు, సాదిక్ పాల్గొన్నారు.

తాండూర్ : ఆటో డ్రైవర్స్ డే సందర్భంగా మండలంలోని ఆటో డ్రైవర్లు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ఆటో డ్రైవర్ల సంఘం అధ్యక్షులు హబీబ్ పాషా, ఉపాధ్యక్షులు చాంద్ పాషా, సలహాదారుడు సాగర్, సెక్రెటరీ కొత్త శంకర్‌తో పాటు మండలంలోని ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.





విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికి తీయాలి



- జిల్లా విద్యాధికారి పార్శి అశోక్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్‌లో పాల్గొనేలా చూడాలని జిల్లా విద్యాధికారి అశోక్ అన్నారు. జిల్లా కేంద్రాల్లోని ఉన్నత పాఠశాలలో జిల్లా సైన్స్ ఉపాధ్యాయుడు మధుకర్ అధ్యక్షతన ఇన్‌స్పైర్ నామినేషన్స్‌కు సంబంధించి నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్లు ఉపయోగపడతాయన్నారు. ఈ నెల 7వ తేదీలోపు అన్ని రకాల యాజమాన్యాలు విద్యార్థుల నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అన్ని యాజమాన్యాలలో 6 నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్ ఒక వరం లాంటిదన్నారు. ప్రతి పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులను వివరాలను నామినేషన్ చేయడానికి వీలుంటుందని అన్నారు. ప్రతి పాఠశాల నుంచి ఐదు నామినేషన్లు పూర్తి అయ్యేలా పాఠశాల ప్రధానోపాధ్యాయులు చూడాలని సూచించారు. దేశవ్యాప్తంగా లక్ష ప్రాజెక్టులను, రాష్ట్రవ్యాప్తంగా 10000 ఉత్తమ ప్రయోగాలు ఎన్నిక చేయబడతాయని వీటిలో ప్రతి ఒక్క ప్రాజెక్టుకి రూ.10000 కేటాయిస్తారని అన్నారు. జాతీయస్థాయిలో ఎన్నికైన విద్యార్థులకు ట్రిబుల్ ఐటీలలో ప్రవేశాలు కల్పించబడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి ఉదయ బాబు, రిసోర్స్ పర్సన్‌లు మామిడాల తిరుపతయ్య వైరాగడే లక్ష్మణ్ పాల్గొన్నారు.

సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్



నవతెలంగాణ-రెబ్బెన

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఐదు కనీస వేతనాల జీఓలను గెజిట్ ప్రకటించి అమలుచేయాలని, అలాగే సింగరేణిలో హైకోర్టు తీర్పు ప్రకారం గుర్తింపు సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్, ఐఎఫ్‌టీయూ బెల్లంపెల్లి ఏరియా అధ్యక్షుడు అరికిల్ల పోచం డిమాండ్ చేశారు. మంగళవారం మహాధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను గోలేటిలోని సివిల్ డిపార్టుమెంటులో కార్మికులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో ఎన్నికలు వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే లాభాల వాటా ప్రకటించి పర్మినెంట్ కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటాలో 40 శాతం వాటా ఇవ్వాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సింగరేణిలో గత 15 సంవత్సరాల నుండి పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కాంట్రాక్టు కార్మికులందరికి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, సింగరేణిలో ఖాళీగా ఉన్న ఇండ్లను ఎలాంటి శరతులు లేకుండా కాంట్రాక్టు కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 9, 10వ తేదీల్లో జరిగే మహాధర్నా కార్యక్రమంలో సింగరేణి కార్మికులు పెద్దఎత్తున పాల్గొని తమ నిరసనను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు శ్రీనివాస్, సంతోష్, చంద్రయ్య, లింగయ్య, లక్ష్మి, కవిత, నాగలక్ష్మి, బాపు, ప్రవీన్ పాల్గొన్నారు.

ఘనంగా జడ్పీ వైస్ చైర్మన్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు కోనేరు కృష్ణారావు జన్మదిన వేడుకలను మంగళవారం ఈజ్ గాం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. బైరగొని రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో కోనేరు కృష్ణ రావు పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం ఈజ్‌గాం గ్రామ పంచాయతీలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్, బుక్స్ పెన్నులు కోనేరు కృష్ణ రావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొట్లకుంట మల్లేష్, ఎంపీటీసీ అరికిల్ల కుమార్, నాయకులు ధనుర్కార్ రానేందర్, పూదరి తిరుపతి, రామగౌడ్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : ఆసిఫాబాద్ కొమురం భీం జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు జన్మదిన వేడుకలను మంగళవారం మండలకేంద్రంలో యువత, బీఆర్ఎస్ కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో రక్తదానం చేశారు. రక్తదానం చేయడానికి ముందుకొచ్చిన యువతకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

కౌటాల : జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు పుట్టినరోజు వేడుకలను మంగళవారం మండల కేంద్ర గ్రామ పంచాయతీ కార్యాలయంలో మండల బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ మాట్లాడుతూ జెడ్పీ వైస్ చైర్మన్ ఇలాంటి పుట్టినరోజు వేడుకలను మరెన్నో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వొజ్జెల మౌనీష్, మొగడ్‌దగడ్ ఎంపీటీసీ బొమ్మకంటి మనీష్, ఉప సర్పంచ్ పసునూరి తిరుపతి, యువజన విభాగం మండల అధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్‌గౌడ్, నాయకులు భిట్టుపెల్లి సంతోష్, కత్తెర్ల ఆత్మారాం, బండి శ్రీనివాస్, రమేష్, సోళ్ల బాపు పాల్గొన్నారు.

బతుకమ్మ ఆడుతూ జీపీ కార్మికుల నిరసన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమస్యల పరిష్కారం కోసం గత 26 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు మంగళవారం 27వ రోజు కలెక్టరేట్ ఎదుట బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ప్రభుత్వం మొదట సమ్మె విరమించమని తర్వాత చర్చలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటివరకు స్పందన లేకపోవడం ఏమిటి అని ప్రశ్నించారు. తెలంగాణ ఆరాధ్య దైవం బతుకమ్మ సాక్షిగా తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పందించే వరకు సమ్మె కొనసాగుతుందని తేల్చి చెప్పారు. భవిష్యత్తులో సమ్మెను మరింత ఉధృతం చేయనున్నట్లు హెచ్చరించారు. పంచాయతీ కార్మికుల సమ్మె ఎంఆర్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు రాజేందర్, జేఏసీ నాయకులు శంకర్, మాట్ల రాజు, మహేశ్వర్, నాగేష్, సమ్మయ్య, సాబీర్, సుగుణ భాయి పాల్గొన్నారు.

సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం(సీఐటీయూ) రాష్ట్ర కమిటీలో చోటు

నవతెలంగాణ-రెబ్బెన

జూలై 29, 30వ తేదీలో కొత్తగూడెంలో జరిగిన మహాసభలు జరిగిన సందర్భంలో సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం ఆరో రాష్ట్ర మహసభలో రాష్ట్ర కాంట్రాక్టు కార్మికుల సంఘం(సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఎ ఓదెలుతో పాటు ఆర్ శారద, గొమాస ప్రవీన్, రాజశేఖర్‌ను రాష్ట్ర కమిటీకి ఎన్నుకున్నారు. రాష్ట్ర మహాసభ మాపై నమ్మకంతో రాష్ట్ర కమిటీలో ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన హక్కులు, జీతాల పెరుగుదల కోసం నిరంతరం పోరాడుతామని తెలియజేశారు.

ఇన్‌స్పైర్ నామినేషన్లు 7లోపు పూర్తిచేయాలి

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఇన్స్‌పైర్ నామినేషన్‌ను ఈ నెల ఏడో తేదీలోపు పూర్తిచేయాలని మండల విద్యాధికారి మనుకుమార్ తెలిపారు. దీనిలో భాగంగా జిల్లా సైన్స్ అధికారి మధూకర్ మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో ఆరు నుండి 10వ తరగతి విద్యార్థులకు ఇన్స్‌పైర్ ఎగ్జిబీషన్ వరం లాంటిదని పేర్కొన్నారు. ప్రతి పాఠశాల నుండి ఐదుగురు విద్యార్థుల నామినేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నవతెలంగాణ-ముధోల్

వర్షాకాలం దృష్ట్యా వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించి గ్రామాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ సుదర్శన్ అన్నారు. మండలంలోని చించాల, వెంకటాపూర్ గ్రామలల్లో మంగళవారం డ్రైడే కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. మురికి నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. టైర్లలో గుంతలలో దోమల లార్వా వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్ తదితర వాటిని వేయాలని అన్నారు. ప్రతి వ్యక్తి తన ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చని తెలిపారు. కార్యక్రమంలో యంపీడీవో సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ 3,3ఏ గని నుండి ఎస్టిపీపీకి బదిలీపై వెళ్తున్న సంక్షేమ అధికారి ఠాకూర్ మోహన్‌సింగ్‌ను మంగళవారం డిప్యూటీ జనరల్ మేనేజర్ సంతోష్ కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ అధికారిగా నిజాయితీతో విశిష్ట సేవలు అందించినందుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ సురేందర్‌రెడ్డి, ఎస్ఆర్పి త్రీ పిట్ సెక్రటరీ రిక్కల గోపాల్, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, గని రక్షణ అధికారి మహేందర్, అధికారులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కోఆప్షన్ సభ్యుని రాజీనామా



నవతెలంగాణ - పెంచికల్‌పేట్

మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సాజిద్ మంగళవారం తన రాజీనామా పత్రాన్ని ఎంపీడీఓ గంగాసింగ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న అధికారులు అభివృద్ధి పనులు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, పనులను పట్టించుకోకపోవడం వంటి నిర్లక్ష్య వైఖరి కారణంగా గ్రామాల్లో పనులు పూర్తికాలేకపోతున్నాయన్నారు. అందువల్లనే కోఆప్షన్ పదవీకి రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

నవతెలంగాణ-ముధోల్

మహిళలు ఆర్థిక అభివృద్ధి చెందాలని ముధోల్ ఇన్‌చార్జి ఐకేపీ ఎపీఎం గురుచరణ్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని సరస్వతి మండల సమాఖ్య కార్యాలయంలో మహాసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళలు అన్ని రంగాలలో ముందు ఉండాలని ఆయన సూచించారు. 2022-2023ఆర్థికంగా రూ.2.50. లక్షలు మండల సమాఖ్య చేసిన లావాదేవీలలో లాభం వచ్చిందని ఆయన అన్నారు. స్త్రీనిధిలో రాష్ట్రంలోనే మొదటి అవార్డు పొందిన ఘనత సరస్వతి మండలసమాఖ్యదేనని పేర్కొన్నారు. దీనికి వీఓఎలు, సీసీలు, ఎంతో కష్ట పడటంతో ఇటువంటి అవార్డులు దక్కాయని తెలిపారు. ఈ మహాసభలో నూతనంగా సరస్వతి మండల సమాఖ్య కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల సమైక్య అధ్యక్షురాలుగా భూషి జ్యోతి (ముధోల్), కార్యదర్శి నవనీత (బోరిగామ్), కోశాధికారి మస్రత్ జాన్(నాయాబాది.ముధోల్), ఉపాధ్యక్షులు జైశీల(రాంటేక్), సహా కార్యదర్శి అనసూయ(కారేగాం)లను ఎన్నికైనట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే మండలంలోని 25 గ్రామ సంఘాల అధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఎంజీ పోశెట్టి, సీసీలు వందేమాతరం, పోశెట్టి, గోదావరి, సూర్యకాంత్, అకౌంటెంట్ సాయినాథ్, ఆయా గ్రామైఖ్యా సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల సంబరాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న క్యాబినెట్ నిర్ణయం పట్ల ఆర్టీసీ ఉద్యోగులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంబరాలు నిర్వహించుకున్నారు. ఇందులో భాగంగా మంగళవారం అదిలాబాద్ పట్టణంలోని ఆర్టీసీ డీపో ఆవరణలో డీపో మేనేజర్ కల్పన ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు సంబరాలు నిర్వహించుకున్నారు. సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తమ చిరకాల ఆకాంక్షను ప్రభుత్వం నెరవేర్చడం పట్ల కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు

సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసిన కార్మికులు

ఆర్టీసీని ప్రభుత్వంలో వీలనానికి క్యాబినెట్ ఆమోదం తెలపడంతో తెలంగాణ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. మంగళవారం ఆదిలాబాద్ డీపో ఎదుట నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపారు. సీఎం కేసిఆర్ కార్మికులకు అండగా నిలుస్తున్నారని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రంగినేని మనిషా అన్నారు. కార్యక్రమంలో విద్యానగర్ వార్డు కౌన్సిలర్ కలాల శ్రీనివాస్ ఉన్నారు.

లక్కేరావ్ మరణం తీరని లోటు

- **ఎంపీ సోయం బాపురావు ప్రగాఢ సంతాపం**

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదివాసీ ముద్దుబిడ్డ కనక లక్కేరావ్ అకాల మరణం ఆదివాసులకు తీరనిలోటని, వివాద రహితుడిగా సౌమ్యుడిగా సమాజంలో మంచి పేరు తెచ్చుకున్న నాయకుడని అదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు సోయం బాపురావు పేర్కొన్నారు. ఈ మెరకు ఢిల్లీ నుంచి ఒక ప్రకటనలో లక్కే రావు మరణం పట్ల దిగ్ర్భాంతి వ్యక్తం చేస్తూ, సంతాపం ప్రకటించారు. రెండు సార్లు ఐటీడీఏ చైర్మెన్‌గా పనిచేసిన లక్కేరావు ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతంలో, ఉమ్మడి జిల్లాలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని, లక్కేరావుతో తనకున్న సంబంధం విడదీయరానిదని పేర్కొన్నారు. ఐటీడీఏ చైర్మెన్‌గా ఆదివాసీ ప్రజలకు మంచి సేవలు అందించారని కొనియాడారు. ప్రభుత్వం ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కుటుంబ సభ్యులకు ఎంపీ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

ఘనంగా అన్నాభావు సాఠే జయంతి

నవతెలంగాణ-బాసర

మండల కేంద్రంలోని బిద్రెల్లి గ్రామంలో మంగళవారం సాహితీ వేత్త అన్నాభావు సాఠే 103వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సునిత విశ్వనాథ్ పటేల్ అన్నాభావు సాఠే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనగారిన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేసిన మహనీయుడని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ కార్యకర్తలను అక్రమ కేసులతో భయపెట్టలేరు'

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్నలో ఓటమి భయం మొదలైందని, అందుకే నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రజాసేవా భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జోగు రామన్న వైఖరిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తన సంస్కారం గురించి మాట్లాడిన ఆయన ఎంతటి సంస్కార వంతుడో నియోజకవర్గ ప్రజలకు తెలుసునని పేర్కొన్నారు. ఆదిలాబాద్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. పదిహేను ఏండ్ల నుంచి ఏకచత్రాధిపత్యంగా ఏలుతున్న రామన్నను ప్రశ్నించేవారు లేకనే ఆయన ఆటలు సాగుతున్నాయని అన్నారు. ప్రశ్నించే వారి గొంతునొక్కాలని అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని మండపడ్డారు. మీ కుటుంబ సభ్యుల అక్రమాలను తాను ప్రశ్నిస్తూనే ఉంటానని అన్నారు. పెన్షన్లు, డబుల్ బెడ్‌రూమ్‌లు, రైతు రుణమాఫీ, రేషన్ కార్డులు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు లోన్లు ఎందుకివ్వలేదని ప్రశ్నించినందుకు తనపై క్రిమినల్ కేసులు బనాయిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరాధార ఆరోపణలతో ఎమ్మెల్యే తనస్థాయిని దిగజార్చుకున్నారని అన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు భరత్ వాగ్మారే, గిమ్మ సంతోష్, మడావి రాజు, రాందాస్ నాక్లే, సంజయ్ గుండావార్ ఉన్నారు.

ఆరోగ్య శాఖ మంత్రిని కలిసిన జెడ్పీటీసీ

నవతెలంగాణ-తలమడుగు



హైదరాబాద్‌లో రాష్ట్ర ఆర్థిక ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావును మంగళవారం హైదరాబాద్ సచివాలయంలో మండల జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి కలిసి మండల సమస్యలను విన్నవించారు. మండలానికి నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. పురాతన మధర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 1955 సంవత్సరంలో వైద్య సిబ్బంది, గదులు నిర్మించారని అన్నారు. ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని కూలిపోతున్నాయని మంత్రికి విన్నవించారు. ప్రస్తుతం వైద్య సిబ్బందికి ఎలాంటి సదుపాయాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మంత్రికి తెలిపారు. మండలంలో ఆదివాసులు మారుమూల ప్రాంతాలలో ఎక్కువ కుటుంబాలు ఉన్నందున ఇద్దరు డాక్టర్లతో పాటు ప్రత్యేకంగా వాహనం మంజూరు చేయాలని కోరారు. గత ఫిబ్రవరిలో కురిసిన భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని మంత్రిని కోరారు.

ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం



నవతెలంగాణ-భైంసా

రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకొని నేటితరం ముందుకు సాగాలని తెలంగాణ రజక సంఘం రాష్ట్ర కోకన్వీనర్ సుంకేట పోశెట్టి అన్నారు. మంగళవారం మండలంలోని కామోల్ గ్రామంలో ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెత్తందారులను, భూస్వాములను గడగడలాడించిన ధీర వనిత ఐలమ్మ అన్నారు. కామోల్‌లో ఆమె విగ్రహం ఏర్పాటు చేయడం శుభ పరిణామమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ట్యాంక్‌బండ్‌పై ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, వీడీసీ సభ్యులు, రజక సంఘం నాయకులు, అవినాశ్, ముత్యం, రాం కృష్ణ, సాయేందర్ పాల్గొన్నారు.

వరద బాధితులకు పరిహారం ఇవ్వాలి



నవతెలంగాణ-భైంసా

ఇటీవల కురిసిన భారీ వర్షాలతో సర్వం కోల్పోయి కష్టాల్లో ఉన్న రైతు లను, ప్రజలను ఆదుకొని వెంటనే వారికి నష్ట పరిహారం చెల్లించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పవార్ రామారావు పటేల్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ఖద్గాం, గ్రామంలో రైతులు, స్థానికులతో కలిసి పంట పొలాలను, రహదారులను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడారు. రైతులు పెద్ద మొత్తంలో నష్ట పోయారని వారికి తక్షణమే పరిహారం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాంపై ఉందన్నారు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి చుట్టపు చూపు పర్యటనలు చేయకుండా అధికారులతో సర్వే చేయించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఎంపీటీసీ రజాక్, మాజీ సర్పంచ్ రాము, వెంగల్ రావు, మారుతి పటేల్, లక్ష్మణ్ పటేల్, చిన్న పాపయ్య, శంకర్, గంగాధర్, దిగంబర్ పటేల్ ఉన్నారు.

నేడు సారంగాపూర్‌లో మంత్రి అల్లోల పర్యటన

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి బుధవారం పర్యటించనున్నారని బీఆర్ఎస్ మండల కన్వీనర్ మాధవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మార్కెట్ యార్డులో పహరీ గోడ, దుకాణ సముదాయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఉదయం 10:30 గంటలకు రైతువేదికలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, ప్యారామూర్, ధని గ్రామాల చెందిన లబ్ధిదారులకు ఇండ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేస్తారని, అనంతరం విద్యార్థులకు బస్ పాసులు అందజేస్తారని తెలిపారు.

మండల కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు

నవతెలంగాణ-సిరికొండ



మండల కేంద్రంలోని రెండో అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల అవశ్యకతపై అంగన్‌వాడీ టీచర్ రాణి అవగాహన కల్పించారు. తల్లిపాలు శ్రేష్టమైనవనీ అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆయా నర్సుబాయి, మహిళలు పాల్గొన్నారు.

సారంగాపూర్ : నవజాత శిశువు ఆరోగ్యంగా పెరగడానికి తల్లి పాలు అమృతంల దోహదపడతాయని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయగౌరీ అన్నారు. మంగళవారం సారంగాపూర్ మండలంలోని సాయినగర్ గ్రామాల్లో గ్రామ సర్పంచ్ నిషా గజేందర్ అధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలకు, గర్భిణీ స్త్రీలు తల్లి పాల వల్ల బిడ్డకు కలిగే లాభాలను వివరించారు. ప్రతి గర్భిణీ స్త్రీ ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నరేష్, అంగన్‌వాడీ టీచర్ శివమ్మ, బాలింతలు, పిల్లల తల్లులు, గర్భవతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా చైర్మెన్‌గా ఆనంద్‌రావ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ ఎస్టీ సెల్ ఆదిలాబాద్ జిల్లా చైర్మెన్‌గా సెడ్మకే ఆనంద్‌రావ్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జీ మానిక్‌రావ్ ఠాక్రే, ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథ్‌ల చేతులు మీదుగా మంగళవారం నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎస్టీ సెల్ రాష్ట్ర చైర్మెన్ బెల్లయ్య నాయక్, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

బేల ఎస్సైని కలిసిన నాయకులు

నవతెలంగాణ-బేల

మండల నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన రాధికను మంగళవారం యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపి, ప్రత్యేక చిత్రపటాన్ని అందజేశారు. నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన తనకు పూర్తిగా సహకరించాలని, ప్రజల సహకారంతోనే తమవంత సేవలను అందించగలుగుతామని ఎస్సై అన్నారు. మండల కాంగ్రెస్ నాయకులు రూప్‌రావు, విఠల్ దేవుతాడే, అఖిల్, విపిన్ ఠాక్రే, కన్య రాజు, బోయర్ ప్రమోద్ ఉన్నారు.